JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాశక్తి
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 19-03-2026
Medchal - Malkajgiri । Thursday 19-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 292
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 292 । Pages : 8 । ₹: 5




## డబ్బులు లేవంటారు..
### వేల కోట్లతో మూసీ ప్రాజెక్టు ఎలా?

- మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదు
- లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీని వ్యతిరేకిస్తున్నాం.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదు



**జయభేరి, హైదరాబాద్, మార్చ్ 18 :**
మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి వాకౌట్ ...మిగతాది 2 లో

## సిద్దిపేట రోడ్లకు మోక్షం ఉందా మంత్రి గారు

- సిద్ధిపేట రింగ్ రోడ్డు పనులు 80%పనులు పూర్తి అయి 20% పనులు ఆగిపోయాయి
- అసెంబ్లీలో మాట్లాడిన హరీష్ రావు



**జయభేరి, సిద్దిపేట :**
మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ ఎన్ని ఉత్తరాలు పంపిన రోడ్ల ఊసు లేదు స్పందన లేదు. రెండేళ్లు గా సిద్ధిపేట లో ఇంచార్జ్ అధికారులతో ఆర్ అండ్ బి శాఖ.. గత ప్రభుత్వంలో సిద్ధిపేట నుండి ఇల్లంత కుంట పోయే పోర్ లైన్ రోడ్డు 70% పనులు పూర్తి అయింది మీరు వచ్చాక తట్టెడు మట్టి ఎత్తలేదు, గుంతల మాయంగా చిన్నకోడూరు ఇల్లంతకుంట రోడ్డు. సిద్ధిపేట రింగ్ రోడ్డు పనులు 80%పనులు పూర్తి అయి 20% పనులు ఆగిపోయాయి.



# రాష్ట్ర సమగ్రాభివృద్ధి మా సంకల్పం

- ఏఐ వల్ల భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి
- కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యంతోనే ఈవీ వాహనాలపై ట్యాక్స్ రద్దు
- శంషాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నై, బెంగళూరు, పూణె నగరాలకు బుల్లెట్ ట్రెయిన్స్
- 67,763 ఉద్యోగాలను భర్తీ చేశాం. మరో 13,197 ఉద్యోగ నియామకాల ప్రక్రియ
- మా ప్రభుత్వం మొదటి విడతగా 1 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి మా మంత్రివర్గం బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తుంది

> "తెలంగాణ సమగ్రాభివృద్ధి, ప్రజల భవిష్యత్తు పట్ల మా సంకల్పం ఏమిటన్నది శాసనసభ వేదికగా గవర్నర్ ప్రసంగం ద్వారా వివరించాం. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ఒక స్పష్టమైన విధానంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం.."
> -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**
శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ముఖ్యమంత్రి సవివరంగా సమాధానమిచ్చారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడానికి రూపొందించిన విశిష్ట ప్రణాళికను శాసనసభ వేదికగా రాష్ట్ర ప్రజల ముందు ఆవిష్కరించిన గవర్నర్ కి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ సంప్రదాయాన్ని కాపాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రతిపక్షం కలిసొస్తుందని ఆశించానని, రాష్ట్రానికి కొత్తగా వచ్చిన గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తే, అభినందించడానికి ప్రతిపక్ష నేత సభకు వస్తారని ఆశించానన్నారు.

"ఏఐ వల్ల భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి, పెద్ద సునామీ రాబోతోందన్న చర్చ జరుగుతోంది. ఆ సవాళ్లను ఎదుర్కొనడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవలసిన అవసరం ఉంది. తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోకపోతే జాతి మనల్ని క్షమించదు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి సాధించాల్సిన లక్ష్యాలతో కేంద్రం ...మిగతాది 2 లో

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు



- ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుంది
- మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. ప్రధాని మోదీ

**జయభేరి, న్యూఢిల్లీ, మార్చ్ 18 :**
రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. ...మిగతాది 2 లో

## అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనం



**జయభేరి, హన్మకొండ :**
హనుమకొండ జిల్లా కడిపికొండ ప్రాంతానికి రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఈ దారుణ సంఘటన జరిగింది. కూతురు రాజశ్రీ, తండ్రి రాజశేఖర్ సజీవ దహనం అయ్యారు. ...మిగతాది 2 లో

# నట్టింట్లో కల్తీ రక్కసి

...మిగతాది 2 లో




# రూ.6 వేల పింఛను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే

- ముఖ్యమంత్రి కార్యాలయంలోదివ్యాంగ శక్తి పథకం పై లబ్దిదారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి
- దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్



**జయభేరి, అమరావతి :**
దివ్యాంగులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 21 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోంది నేను, పవన్ కళ్యాణ్, లోకేష్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి మీతో ప్రయాణించటం నాకు సంతృప్తిని ఇచ్చింది. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్నవాళ్లు. గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశాం.

మొదటిపేజీ తరువాయి

## సిద్దిపేట రోడ్లకు మోక్షం ఉందా మంత్రి

ముండ్రాయిఅంక్షాపూర్ చివరి దశలో ఉంది. రెండేళ్ల మీ ప్రభుత్వం లో పనులు కాక రోడ్లు ఆగిపోయింది.సిద్దిపేట ఆడిపోయిన రోడ్ల పనులు, ఆర్ అండ్ బి అధికారుల నియామకం పై అసెంబ్లీ లో మాట్లాడిన మాజీ మంత్రి, బీ ఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు.సిద్దిపేట జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ లో డిప్యూటీ ఈఈ, ఈఈ, ఏ ఈ పోస్ట్ లు రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉందని, పది ఉత్తరాలు రాసిన మంత్రి నుండిస్పందనలేదని,అదేవిధంగా సిద్దిపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో రోడ్లు మంజూరు అయిఅర్థాంతరంగా ఆగిపోయినవి మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం రోజున అసెంబ్లీ లో హరీష్ రావు మాట్లాడారు. రెండు ఏళ్లుగా సిద్దిపేట ఆర్ అండ్ బి శాఖ లో ఇంచార్జ్ అధికారులతో నడిపిస్తున్నారు, సిద్దిపేట కు ఈఈ, డిఈ,ఏ ఈ లు ఖాళీగా ఉన్నాయని, పలు మార్లు మంత్రి ఉత్తరం వ్రాసానని ఎలాంటి స్పందన లేదన్నారు. దయచేసి వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను నియామకం చెయ్యాలని కోరారు. అదేవిధంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిద్దిపేట జిల్లాకు ఒక్క రోడ్డు కూడా మంజూరు చేయలేదని,కొత్తది ఇవ్వక పొగ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో మంజూరు అయిన రోడ్లు అర్థాంతరంగా ఆగిపోయి మోచేతి లోతు గుంతలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సిద్దిపేట రోడ్లకు మోక్షం ఉందా మంత్రి గారు.సిద్దిపేట రింగ్ రోడ్డు పనులు 80% శాతం పూర్తి అయ్యాయని మిగతా 20% గుంతలు మయం అయి రాత్రి పూట ప్రమాదాలు జరిగి చనిపోతున్నారని రింగ్ రోడ్ పనులు పూర్తి చేయాలి అని ఆర్ అండ్ బి మంత్రి విజ్ఞప్తి చేసారు. సిద్దిపేట నుండి చిన్నకోడూరు మండల కేంద్రం మీదుగా ఇబ్రహీంపూర్ వరకు పోర్ లైన్ రోడ్డు గత ప్రభుత్వం లో మంజూరు అయిన రోడ్డు 70% పూర్తి అయింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రోజు ఆగిపోయింది ఇప్పటికీ అదే పరిస్థితిలో ఉంది రెండేళ్ళ మూడు నెలల నుండి కనీసం తట్టెడు మట్టి పోయకపోవడం వల్ల ప్రజలు దుమ్ము,దూళి,ప్రమాదాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు.సిద్దిపేట చిన్నకోడూరు రోడ్డు ని పూర్తి చేయాలని కోరారు. నంగునూర్ మండలం లో సీఆర్ఎఫ్ నిధులతో మంజూరు అయిన ముండ్రాయి అంక్షాపూర్ రోడ్డు మంజూరు అయింది. 70% పనులు పూర్తి అయింది. బిటి ఫైనల్ లేయర్ పనులు రెండు సంవత్సరాలనుండి ఆగిపోయాయి దయచేసి దాన్ని పూర్తి చేయాలి అని కోరారు.

## రూ.6 వేల పింఛను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే

ట్రైసైకిళ్లతో పాటు మీ ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లు అందించాం. దివ్యాంగులకు పింఛను కింద రూ.6 వేలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్ ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నాం. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. రూ.33 వేల ఏ పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఎలాంటి ఖర్చు లేకుండా 5 రకాల బస్సుల్లో దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పనులకు, అవసరాలకు ఖర్చు లేకుండా ప్రయాణం చేయవచ్చు. నెలకు రూ.2 వేల దాకా మీ అందరికీ ఆదా అయ్యే అవకాశం ఉందని అన్నారు. మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి పనిచేస్తోంది మేమే. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మంచినిర్ణయాలు చేస్తాం. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత బాగా జరుపుకోండి. అందరికీ ఉగాది శుభాకాంక్షలు. దివ్యాంగ శక్తిద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నాం ఎంత ఖర్చు చేస్తున్నామన్నది ముఖ్యం కాదు. దివ్యాంగులకు గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నాం. పథకంపై మీ అందరి స్పందన మాకు మరింత ఉత్సాహాన్ని, సంతోషాన్ని ఇస్తోంది. కూటమి అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమే. ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే దివ్యాంగులకు అండగా నిలబడాలనే కూటమి పనిచేస్తోంది. మహిళల కోసం స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయి. నేడు దివ్యాంగ శక్తితో లక్షల మందికి మేలు జరుగుతుంది. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చూసే మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను అభినందిస్తున్నానని అన్నారు.

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరువుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళ్తుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు.

## తండ్రి, కుమార్తె సజీవ దహనం

ఇంట్లో నిద్రిస్తున్న తండ్రి - కూతురు తెల్లవారేసరికి బూడిదయ్యారు. తండ్రి కూతురు ప్రమాదంలో చనిపోయారని వాళ్ళ అల్లుడు ప్రవీణ్ బంధుమిత్రులకు ఫోన్ ద్వారా తెలియపరచాడు. బంధుమిత్రులు ఏం ప్రమాదం జరిగిందో..! ఎలా చనిపోయారో అనే ఆందోళనతో పరుగులు పెడుతూ అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సైతం సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసులు దర్యాప్తు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇది ప్రమాదం కాదని.. ప్లాన్ ప్రకారం చేసిన మర్డర్ అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కుటుంబ కలహాలు నేపథ్యంలో అల్లుడు ప్రవీణ్ తన భార్య రాజశ్రీ, ఆమె తండ్రి రాజశేఖర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్టు పోలీసులు గుర్తించారు. అయితే చింతల్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కు రాజీవ్ గృహకల్పకు చెందిన రాజశ్రీతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. అయితే ప్రవీణ్ ఏం పని లేకుండా తిరుగడం స్టార్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న రాజశ్రీ తండ్రి రాజశేఖర్ కూతురి ఇంటికి వచ్చి అల్లుడు ప్రవీణ్‌ను మందలించారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన అల్లుడు తన భార్య, మామ ఇంట్లో నిద్రిస్తుండగా పెట్రోల్ పోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు పోలీసులకు చిక్క కటకటాల పాలయ్యాడు.

# నట్టింట్లో కల్తీ రక్కసి



భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు.వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ప్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు.కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి.అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘ కాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్‌స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాం తక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్‌ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేల డం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదెలు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు.ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాన్ల కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తాల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపు తుంది.పాలలో లాక్టో మీటర్ పరీక్షలతో కూడా గుర్తించలేని విధంగా కార్బోహైడ్రేట్లు కలుపుతున్నారు. ఇంతటి ప్రమాదకర స్థితి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆహార భద్రతా శాఖతో తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజలు రోగాలపాలై అర్థాంతరపు చావులకు గురికాక తప్పదు.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధి మా..

వికసిత్ భారత్ ప్రణాళికలు చేస్తే, తెలంగాణ ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలతో తెలంగాణ రైసింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాం. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడానికి విజన్ డాక్యుమెంట్ తీసుకొచ్చాం. రాష్ట్రంలో యువతీ యువకులకు, మహిళలు, రైతులకు భరోసా, ఆ వర్గాల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ప్రణాళికలు రూపొందించాం. ఆ మేరకు కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తరలించాలని నిర్ణయించాం. అద్భుతమైన వారసత్వం సంపదతో ఒకనాడు రాక్ సిటీ, లేక్ సిటీగా విలసిల్లిన హైదరాబాద్ నగరానికి పూర్వ వైభవం తేవాలన్న లక్ష్యంలో భాగంగా మూసీ నది ప్రక్షాళనకు ప్రణాళికలు చేశాం.దేశంలోని కాలుష్యంతో ఢిల్లీ, వరదలతో ముంబై, చెన్నై ట్రాఫిక్ ఇతర సమస్యలతో బెంగళూరు వంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న పరిస్థితులను గమనించిన తర్వాతైనా, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అంచనా వేసుకుని ముందుకు వెళ్లకపోతే భవిష్యత్తు తరాలు క్షమించవు.జీవించడానికి కూడా వీలులేకుండా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా మార్చి, ఇక్కడి రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించాం.కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యంతోనే ఈవీ వాహనాలపై ట్యాక్స్ రద్దు చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్ చార్జీలను రద్దు చేయడం వల్ల 2025, 26లో ప్రభుత్వం 791 కోట్ల ఆదాయం కోల్పోయింది. అయినా కాలుష్యం నియంత్రించాలన్న లక్ష్యంతో నిర్ణయం తీసుకున్నాం.కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రానప్పుడు ప్రభుత్వమే దాన్ని టేకోవర్ చేసి విస్తరణ ప్రాజెక్టులను చేపడుతుంది.360 కి.మీ. మేర రీజినల్ రింగ్ రోడ్డు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టుకు కూడా కేంద్రం అనుమతించింది. ఔటర్ రింగ్ రోడ్డు - రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగాన్ని మాన్యుఫాక్చ రింగ్ ప్రాంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అనుగుణంగా తీర్చిదిద్దుతాం.శంషాబాద్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారబోతోంది. శంషాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నై, బెంగళూరు, పూణె నగరాలకు బుల్లెట్ ట్రెయిన్స్ ప్రాజెక్టులను కేంద్రం నుంచి సాధించుకున్నాం. అలాగే మచిలీపట్నం వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించబోతున్నాం.రీజినల్ రింగ్ రోడ్డు అవతలి భాగం నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనతో రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికలు చేశాం. 1.10 లక్షల చ.కి.మీ మేరకు రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీని వృద్ధి చేయడానికి ప్రాంతాల వారిగా పంటలను, ముఖ్యంగా రైతులకు మరింత లాభదాయకంగా పంటల మార్పిడి విధానాలు, ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రోత్సహించాలని నిర్దేశించాం. ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లడంలో భాగంగా వివిధ పాలసీలను తీసుకొచ్చాం. ఇందిరా మహిళా శక్తి పాలసీ, టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, లైఫ్ సైన్సెస్ పాలసీ, క్రీడా విధానం తీసుకొచ్చాం.

పర్యావరణం కాపాడి, పరిశుద్ధమైన నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కాలుష్య కారక పరిశ్రమలను తరలించడానికి తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై ప్రతిపక్ష నాయకులు కోరితే ఎలాంటి విచారణకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏ ఏజెన్సీ, సంస్థతోనైనా విచారణకు ఆదేశించడానికి సిద్ధంగా ఉంది. అలాగే టీడీఆర్‌ల విషయంలో కూడా తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జారీ అయిన వాటిపై ప్రతిపక్ష నాయకులు లేఖ రాస్తే సమగ్ర విచారణ చేయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణ యువకుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకున్నాం.



67,763 ఉద్యోగాలను భర్తీ చేశాం. మరో 13,197 ఉద్యోగ నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఇప్పటివరకు ఈ పథకం కింద మహిళలు 9,700 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు. 22 ఇందిరా మహిళా శక్తి జిల్లా కేంద్రాలను నిర్మించుకోబోతున్నాం.నిరుపేదల వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 2,300 కోట్లు ఖర్చు పెట్టాం. CMRF కింద 2,046 కోట్లు ఖర్చుచేశాం. ఆడబిడ్డలకు రూ. 500 సబ్సిడీ కింద సిలిండర్ అందించడానికి రూ. 752.22 కోట్లు వెచ్చించాం. గృహ జ్యోతి పథకం కింద 52 లక్షల కుటుంబాలకు రూ. 397 కోట్లు ఖర్చు పెట్టాం. రాష్ట్రంలోని 39 వేల ప్రభుత్వ స్కూల్స్, విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాం. రైతు రుణమాఫీ కోసం రూ. 20,616 కోట్లు, రైతు భరోసా కింద 18 వేల కోట్లు, సన్నవడ్లకు బోనస్ గా ఇప్పటివరకు 1940 కోట్లు చెల్లించాం. ఇవి ప్రభుత్వ గ్యారెంటీలు.ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లు, పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తు తరాల కోసం తెలంగాణ విజన్ 2047 దార్శనిక పత్రం రూపొందించాం. స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని నెహ్రూ, ఆ తర్వాత ఇందిరాగాంధీ, పీవీ నరసింహరావు గారు దూరదృష్టితో ప్రణాళికబద్ధంగా విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న కారణంగానే ప్రపంచంలో ఒక పటిష్టమైన దేశంగా భారత్ నిలబడగలిగింది.నేను కష్టజీవిని. తెలవంది నేర్చుకుంటా. నేర్చుకున్నది పది మందికి చెబుతా. తట్టపని మట్టిపని చేసి కష్టపడి పైకొచ్చినవాడిని. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేయడానికి కష్టపడతా. మా ప్రభుత్వం మొదటి విడతగా 1 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి మా మంత్రివర్గం బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తుంది." అని అన్నారు.

## డబ్బులు లేవంటారు..

చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇవాళ అసెంబ్లీలో మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక అంశాలపై కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీశారు. ముఖ్యంగా డీపీఆర్ (DPR) తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లాలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ADB) లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్‌హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# రైతులు అధిక దిగుబడులు వచ్చే పంటలను వేయాలి

- వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**జయభేరి, తుర్కపల్లి, మార్చి 18 :**

రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలం అధిక దిగుబడి వచ్చే పంటలను వేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి రమణ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాఫ్ బుకింగ్, డిజిటల్ క్రాస్ బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రీ పథకాలను కార్యక్రమాల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్యక్రమాల పురోగతిని ఏఈఓలను ప్రైవేటు సర్వేలను అడిగి తెలుసుకున్నారు. దత్తాయపల్లి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు అమరేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న మునగ పంటను పరిశీలించి మునుగ ఆకులను ఎండబెట్టి ఆ ఆకులను పొడిచేసి ఆ పొడి తోటి బ్యాగు సూప్ తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలం అధిక దిగుబడి లాభాలను అందించే అద్భుతమైన పంట మునగ పంట అని మునగ ఆకులతో విటమిన్లు పుష్కలంగా ఉంటాయని, అలాగే కాలుష్యం పొటాషియం ఐరన్ ప్రోటీన్ అధికంగా ఉంటాయని అంతర్జాతీయ మునగ పంటకు అధిక డిమాండు ఉందని తెలిపారు.

ఈ ప్రాజెక్టును ఎంచుకొని ఇదే తరహాలో జిల్లాలోని 17 మండలాల్లో 17 యూనిట్లు స్థాపించవలసిందిగా గ్రామీణాభివృద్ధి వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు రైతులు అందరూ వరి పంటకు బదులుగా వాణిజ్య ప్రయోజనాలు కలిగిన మునగ పంటను సేంద్రీయ విధానంలో సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మాధవితో కలిసి ఆయిల్పామ్ నర్సరీ ఆయిల్ ఫామ్ క్షేత్రాలను పరిశీలించారు రైతులు నేషనల్ మిషిన్ ఆన్ ఆయిల్ ఫామ్ పథకం సద్వినియోగం చేసుకొని ఆయిల్ ఫామ్ సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పివి రమణా రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి మాధవి, సహాయ వ్యవసాయ సంచాలకులు యాదగిరిగుట్ట శాంతి నిర్మల తుర్కపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీ ఉమా, వ్యవసాయ అధికారి రాకేష్, చైతన్య, ఏఈఓ లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- ఆసరా పింఛన్లు, ఉపాధి, భద్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లులక్ష్మి





**జయభేరి, మేడ్చల్ :**

మహిళలు అనేక సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ, వాటి పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. ఆసరా పింఛన్లు, ఉపాధి అవకాశాలు, భద్రత వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ కమలానగర్ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో ఐద్వా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎన్.సృజన అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల జీవన పరిస్థితులు రోజురోజుకూ కష్టతరంగా మారుతున్నాయని అన్నారు. ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఏండ్లు గడిచినా ఇప్పటికీ అమలు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లోనే పింఛన్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని, వెంటనే అమలు చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం ప్రకటించినప్పటికీ, బస్సుల సంఖ్య తగ్గడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచి సౌకర్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద రు.2,500 ఆర్థిక సహాయం విషయాన్ని కూడా అసెంబ్లీలో చర్చించి అమలు చేయాలని సూచించారు.

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇళ్లను సర్వే చేసి అందించాలని కోరారు. గ్యాస్ ధరలను రు.60 పెంచడం మహిళలపై అదనపు భారంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని, భద్రతా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ మాట్లాడుతూ.. మహిళల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసరా పింఛన్లు, ఉపాధి, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, భద్రతను పటిష్ఠం చేయాలని సూచించారు. ఐద్వా తరపున మహిళా సమస్యలపై పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్స్ ఆర్.లక్ష్మి, పి.మంగ, సఫియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సమస్యలు తీర్చండి

- అసెంబ్లీ క్వశ్చన్ అవర్ లో దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన సమస్యలు తీర్చాలని బుధవారం అసెంబ్లీ క్వశ్చన్ అవర్ లో భాగంగా పలు ఆరోగ్య శాఖ సంబంధించిన అంశాలపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మాట్లాడారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న 25 వెంటి లెటర్ బెడ్ లకు గాను మరో 25 అదనపు వెంటిలేటర్ బెడ్ లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గత రెండేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రులకు పేషంట్ల తాకిడి పెరిగినందున, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల సంఖ్యను పెంచాలన్నారు. దేవరకద్ర నియోజకవర్గంకు సంబంధించి... నియోజకవర్గంలో 67 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది, జరుగుతున్న యాక్సిడెంట్లను దృష్టిలో ఉంచుకొని, ఒక ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని, 50 పడకల ఆసుపత్రిగా అప్రేడ్ చేయాలని, చిన్నచింతకుంట మండల కేంద్రంలోని పి హెచ్ సి ని, పేరూరు గ్రామంలోని పీహెచ్ సీ ని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లుగా అప్రేట్ చేయాలన్నారు. చిన్న చింతకుంట, దేవరకద్ర లో రెండు డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు.

# చెత్త డంపింగ్ యార్డ్ స్థలమా..? కూరగాయల మార్కెట్టా..?

- మురికి కూపంగా మారిన యాదగిరిగుట్ట అంగడి బజార్

**జయభేరి, యాదగిరిగుట్ట :**







యాదగిరిగుట్ట పట్టణ నడిబొడ్డున ఉన్న అంగడి బజార్ కూరగాయల మార్కెట్ ప్రస్తుతం కూరగాయల విక్రయాలకు కాకుండా, చెత్తాచెదారానికి నిలయంగా మారిందని బిఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన అంగడి బజార్ ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ పేరుకుపోయిన మురికిని, దుర్వాసనను చూసి మున్సిపల్ అధికారులు పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాదగిరిగుట్ట మున్సిపల్ 4వ వార్డుతో పాటు 11వ వార్డుల మధ్య విస్తరించి ఉన్న అంగడి బజార్ ప్రస్తుతం భారీగా పేరుకుపోయిన చెత్తతో కంపు కొడుతోంది. ఇది మార్కెట్ కాకుండా చెత్త డంపింగ్ యార్డులాగా కనిపిస్తోంది. అపరిశుభ్రత వల్ల స్థానిక ప్రజలు, వ్యాపారులు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. మురికి కూపంగా మారుతున్న ఈ ప్రాంతంపై అధికారులు దృష్టి సారించకపోవడం దారుణం. యాదగిరిగుట్ట పట్టణం నడిబొడ్డున ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నా, మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు ఇది కనబడటం లేదా ఆయన ప్రశ్నించారు. అంగడి బజార్ లోని మురికిని, చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలి, మున్సిపల్ యంత్రాంగం నిద్ర వీడి వెంటనే చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు, తక్షణమే మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. భవిష్యత్తులో చెత్త పేరుకు పోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాటూరి బాలయ్య, లింగం పాల్గొన్నారు.

# ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

- జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కో ఆర్డినేటర్ గోవర్ధన్ నాయి



**జయభేరి, దేవరకద్ర :**

ఉగాది పండుగ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కో ఆర్డినేటర్ దేవరకద్ర మండలం బస్వాయిపల్లి ఉపసర్పంచ్ గోవర్ధన్ నాయి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సరంలో భగవంతుడి ఆశీస్సులతో, ప్రతి ఇంట సిరులు కురవాలని, పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో ప్రతి రైతు కుటుంబం ఆనందంతో మురిసిపోవాలని ఆకాంక్షించారు.



# ఘనంగా ఉగాది పండుగ సంబరాలు

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 18 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వ భారతి గ్లోబల్ స్కూల్లో బుధవారం ఘనంగా ఉగాది పండుగ సంబరాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రతిమ మాట్లాడుతూ ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మట్టి కుండలో చేసే మామిడి, చింత, వేప, చెరుకు, బెల్లం కలగలిపిన షడ్రుచుల గొప్పదనం, తీపివంటల కమ్మధనం ఉగాది పచ్చడి, ప్రకృతితో మమేకమయ్యే ఆనందమయం ఉగాది పండుగ గొప్పదనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, శైలజ, రామలీల, రాజేశ్వరి, కల్పన, శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు. డిటిఓ

- యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 18 :**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయం జిల్లా పరిధిలో డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్లు ఘననీయంగా నమోదైనట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ ఒకటి నుండి 2026 మార్చి 15 వరకు మొత్తం 337 లైసెన్సులను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రధాన కారణంగా నిలిచిందని అన్నారు. ఈ క్రమంలో 207 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. కోర్టు కేసుల కారణంగా 58 లైసెన్లు సస్పెండ్ చేసినట్లు, ప్రమాదాల కారణంగా 02 లైసెన్సులు నిలిపివేసినట్లు, ఓవర్ లోడ్ వాహనాలపై కూడా చర్యలు తీసుకుంటూ 10 లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు వివిధ ఆర్డర్ల కింద 60 లైసెన్సులను తిరిగి మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించి లైసెన్సులు రద్దు చేసిన సందర్భాల్లో గరిష్టంగా ఆరు నెలల వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. మిగతా కేసులో డ్రంక్ అండ్ డ్రైవ్, కోర్టు కేసులు, ఓవర్ లోడ్ తదితర సాధారణంగా మూడు నెలల వరకు లైసెన్సు రద్దు చేస్తామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా వాహనాలు నడపాలని సూచించారు.

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. జిల్లా కలెక్టర్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 18 :**

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు హాజరు వివరాలను సంబంధిత పరీక్ష అధికారులను అడిగి తెలుసుకున్నారు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులను ప్రధాన గేటు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు జవాబు పత్రాల డిపాజిట్ లను పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రంలోకి ఇతర వ్యక్తులు వెళ్లకుండా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ కేంద్రాలు మూసివేసాల చూసుకోవాలన్నారు జిల్లాలో ఎక్కువ మాల్ ప్రాక్టీస్ జరపరాదని పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలు తమ వ్యవసాయ పనులను ఉగాది నుండి కొత్తగా ప్రారంభిస్తారని, వ్యవసాయ నామ సంవత్సరంగా ఉగాది నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. అప్పుడే పరాభవ నామ నూతన సంవత్సరానికి సంపూర్ణత లభిస్తుందని ఆయన అన్నారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# మొక్కజొన్న కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నేతల నిరసన

- గన్‌పార్క్ నుండి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ నిరసన ర్యాలీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు




**జయభేరి, షాద్ నగర్, మార్చి 18 :**

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాల లో భాగంగా రైతుల నుండి మొక్కజొన్న కొనుగోలు చేసి మద్దతు కల్పించాలని గన్ పార్క్ నుండి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు ఉమ్మడి పాలమూరు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తదితరు లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల వద్ద ఉన్న మొ క్కజొన్నలు కొనుగోలు చేసి మద్దతు ధర కేటాయించి కొనుగోలు కేంద్రాలను తెరవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడు తూ.... రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవా లని, ముఖ్యంగా మొక్కజొన్నకు మద్దతు ధరతో ప్రభు త్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు న్యాయం చేయాలని గన్ పార్క్ వద్ద బుధవారం బిఆర్ఎస్ పార్టీ నేతలు నిరసనకు దిగారు. ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకోమ ని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఊరుకోబమని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీలైనంత తొందరగా మొక్కజొన్న రైతులకు కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేసి తక్షణమే వారికి న్యాయం చేయాలని నిరసన కార్యక్రమంలో వారు పేర్కొన్నారు.



## అన్నసమారాధన కార్యక్రమంను ప్రారంభించిన మాడుగుల ఎమ్మెల్యే

**జయభేరి, పరవాడ:**

కొత్త అమావాస్య సందర్భంగా పరవాడ గ్రామంలో నూకాలమ్మ అమ్మవారిని మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పరవాడ గ్రామంలో వేంచేసి ఉన్న భక్తుల కొంగుబంగారం శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసా దన కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పరవాడ సి ఐ మల్లికార్జు నరావు, ఆలయ కమిటీ సభ్యులు గొరుపూటి రమణ,పైలా బుజ్జి ,పయిల కృష్ణ, గోరుపోటి వెంకటరావు, అనిమిరెడ్డి శ్రీను,బండారు సింహాచలం నాయుడు ,పోతల శ్రీధర్, చుక్క మురళీ, వర్రి చంద్రశేఖర్, గండి మహేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారి చల్లని చూపు ప్రజలపై ఉండాలి

- నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకొన్న ఎంపీపీ పైలా దంపతులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ గ్రామంలో వేంచేసి ఉన్న భక్తుల కొంగుబంగారం శ్రీ నూకాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా పరవాడ మండలం ఎంపీపీ దంపతులు పైలా వెంకట పద్మ లక్ష్మి,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పైలా శ్రీనివాసరావు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించా రు.ఈ సందర్భంగా ఎంపీపీ పైలా మాట్లడుతూ అమ్మవారి చల్లని చూపు ఈ గ్రామ ప్రజలమీద మరియు ఈ ప్రాంతం మీద ఉండాలని అందరికీ మంచి జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ పైలా అప్పారావు దంపతులు,వర్రీ హరి, పైలా పైడంనాయుడు, చీపురుపల్లి శ్రీను,గండి వాసు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా నక్కా హరి కిషోర్ నియామకం



**జయభేరి, పరవాడ:**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నం రెడ్డి అదీప్ రాజ్ సిఫార్సుతో నక్కా హరి కిషోర్ ను, అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి గా నియమించారు.ఈ మేరకు ఆదివారం తాడే పల్లి కేంద్ర కార్యాలయం నుండి ప్రకటన వెల్లడించారు జివియంసి 85వ వార్డు మంత్రిపాలెం జెఎన్ఆర్ఎమ్ కాలనీకి చెందిన నక్కా హరి కిషోర్‌కు ఈ కీలక బాధ్యతలను అప్పగించడం జరిగింది. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.ఈ సందర్భంగా నక్కా హరి కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కు,మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సంద ర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు హరి కిషోర్‌కు అభినందనలు తెలిపారు.

## వసంత ఋతువు రాక ప్రకృతి పులకింత



**జయభేరి, దేవరకొండ :**

నూతన తెలుగు సంవత్సరం ఆరంభం వసంత ఋతువు ప్రారంభం సందర్భం గా ప్రకృతి ఒడిలో చెట్లు కొత్త చిగుర్లు వేసి,పూత పూసి, కాయలు కాసి ప్రకృతికే అందాన్ని అందజేస్తాయి. ఈ మార్పును మానవ మాత్రులు స్వంతగా ఏర్పాటు చేయలేరు. అది ప్రకృతికి మాత్రమే సాధ్యమౌతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి అన్నారు. ఏఐ కనిపెట్టిన మానవుడు చలి కాలంలో చెట్లను పూత పయించలేడు. చైత్రమాసం ఉగాది పండుగ మామిడి కాయలు, వేపపూత, కొత్త చింతపండు ఉగాది పచ్చడి వాతావరణం మార్పుకు మానవులకు మందు లాంటిది అన్నారు. వారు తన ఇంటిచుట్టూ ఎన్నో రకాల చెట్లు నాటి వాటిని సంరక్షణ చేస్తూ ఆనందం పొందుచున్నారు. వారి ఇంటి వాతావరణం చుస్తే మనముకూడా ఇలా చెట్లు పెంచాలని కోరిక కలుగుతుంది. వృక్షో రక్షితి, రక్షితం అనే నానుడి అమలు చేస్తున్నారు.



## మన జీవితాల్లో నూతనత్వాన్ని నింపే పండుగ ఉగాది

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

ప్రకృతిలో వచ్చే మార్పులతో పాటు మన జీవితాల్లో నూతనత్వాన్ని నింపేది ఉగాది పండుగ అని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆయన పరాభవ నామ శుభా కాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.నూతన తెలుగు సంవత్సరం ప్రజల కుటుంబాల్లో ఆర్థిక,ఆరోగ్య,సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.షడ్రుచులు సమ్మేళనంగా చేసే ఉగాది పచ్చడి జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా చూడాలనే సందేశం ఇస్తుందన్నారు.ఉగాది పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల కోరారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు

- దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి



**జయభేరి, దేవరకొండ :**

తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ ప్రతి కుటుంబాని కి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే శుభదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని, జిల్లా అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పండుగ వేడుకల ను నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, పరిశుభ్రమైన వాతావ రణంలో ఉగాది వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరికి శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలను తీసుకురావా లని వారు ఆకాంక్షించారు.

## నడి రోడ్డుపై పసికందు మృతదేహం కలకలం

**జయభేరి, ఆదిలాబాద్ :**

గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన మగ పసికందు మృతదేహం లభ్యమైంది. స్థానికులు పోలీసుల కు సమాచారం అందించడంతో, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పసికందును ఎవరైనా కావాలనే వదిలేశారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# వసంత నవరాత్రి ఉత్సవాలు

- 19న ఉగాది వేడుకలు.. 28 వరకు నవరాత్రులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాల యమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నుండి వసంత నవరాత్రులు ప్రారంభమవుతు న్నాయి. ప్రతి ఏడాది దేవాలయంలో వసంత నవరాత్రులు అత్యంత ఘనంగా నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా వసంతర నవ రాత్రులకు దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 28 వరకు వసంత వేడుకలు దేవాలయంలో జరగనున్నాయి.

నవరాత్రుల ప్రారంభోత్సవం సందర్భంగా మొదటిరోజు గురువారం స్వామివారికి ప్ర త్యేక అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ. మధ్యాహ్నం 11 గంటలకు పంచాంగ శ్రావణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నా రు. రాత్రికి స్వామివారి సేవ నిర్వహిస్తారు. ఈనెల 27 తేదీన శ్రీరామ నవమి సందర్భం గా పవిత్ర కళ్యాణోత్సవం కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. అనంతరం అఖండ భజన ప్రారంభమవుతుంది. 28వ తేదీన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ని ర్వహిస్తారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో ప్రతిరోజు విశేష పూజలు, 23, 24 తేదీలలో సుందరకాండ పారాయణాన్ని నిర్వహిం చనున్నారు. కావున భక్తులు స్వామివారిని దర్శించి తరించగలరని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, దేవస్థానం చైర్మన్ అళహరి మధు సూదన్ కుమారు మరియు ఈవో శ్రీనివాస రాజు తెలిపారు.

# మార్చి 20న చలో అసెంబ్లీ



**జయభేరి, దేవరకద్ర :**

కేజీబీవీ/యుఆర్ఎస్/ఎస్ ఎస్ ఉద్యోగుల సమస్యల సాధన కోసం టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మార్చి 20న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్న ట్లు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యం. వేణుగోపాల్ బుధవారం తెలియచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేజీబీవీ/యు ఆర్ ఎస్ సర్వ శిక్ష ఉద్యోగులకు కనీస మూల వేతనాన్ని ప్రభుత్వం చెల్లించాలని, స్వల్ప కారణాలతో ఉద్యోగుల తొలగింపు మానుకో వాలని, యుఆర్ ఎస్ లో పనిచేస్తున్నటువంటి సిఆర్ టి హిందీ, పిఈటి లకు సిఆర్ టిలతో సమానంగా వేతన ఇవ్వాలని, సిఆర్ పిలు ఎంఆర్ సి సిబ్బందికి కనీస వేతనాలతో పాటు టిఏ, డిఏలు చెల్లించాలని, పార్ట్ టైం కంప్యూ టర్ ఇన్స్ట్రాక్టర్స్, ఒకేషనల్ ట్రైనర్ లను పూర్తి కాలం పని చేయించుకుంటున్నందువలన సి ఆర్ టి లుగా మార్చి బేసిక్ ఇవ్వాలన్నటువం టి మొదలైన పరిష్కారం చేయవలసినటువం టి వాటిని వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ఈనెల 20 న టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ పోరాట కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కేజీబీవీ, యు ఆర్ ఎస్, సర్వ శిక్ష ఉద్యోగులను చైతన్యం చేయనైనది. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు కే. శంకర్ ప్రధాన కార్యదర్శి డి. కృష్ణ ,కేజీబీవీ ఎస్ ఓ అనురాధ, సి ఆర్ టిఎస్ పావని, సారా తపస్సుమ్, జ్యోతి, అనిత, యు ఆర్ ఎస్ ఉద్యోగులు, సర్వ శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నూకాలమ్మ జాతర

- భక్తుల కోలాహలం మధ్య ఎమ్మెల్యే బండారు దంపతుల ప్రత్యేక పూజలు



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వేడుకగా జరిగింది. ఆధ్యాత్మిక చింతనతో పాటు రాజకీయ ప్రముఖుల కల యికతో ఈ జాతర ప్రత్యేకతను సంతరించు కుంది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత,మా జీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి తన సతీమణి మాధవీలత తో కలిసి అమ్మవారిని దర్శించుకుని గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్చార్జి పంచకర్ల ప్రసాదరావు, జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, సర్పంచులు బొద్దపు శ్రీనివాస్ కాసులు తదితరులు నూకాలమ్మతల్లిని దర్శిం చుకున్నారు.జాతరలో భాగంగా ఆలయ ప్రాంగణంలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ఎమ్మెల్యే బండారు, బండారు మాధవి లత, పంచకర్ల ప్రసాదరావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.అధిక సంఖ్యలో ప్రజలు అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ ఉపసర్పంచ్ వెన్నెల అప్పారా వు ,పైలా ప్రసాద్, భోజంకి అప్పలనాయుడు, వెన్నెల గిరి,వాసిరెడ్డి ఈశ్వరరావు, లోకిరెడ్డి సన్యాసినాయుడు (అభి) వెన్నెల సన్యాసిరా వు, పైల అప్పలనాయుడు జూనియర్ , పైల వరలక్ష్మి,గొంప మారునాయుడు,బండారు వీ రునాయుడు, బండారు నర్సింగరావు,ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సమన్వయంతో జాతరను జయప్రదం చేశారు.

# పీర్జాదిగూడలో చలివేంద్రం ప్రారంభం

- వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

**జయభేరి, మేడిపల్లి :**




మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో కొల్తూరు సాయి కుమార్ తల్లి దండ్రులు అనసూయ, యాదయ్య ల జ్ఞాప కార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, చేరుకు మహేష్ గౌడ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సాయి కుమార్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో తోటి వారికి సాయం చేయాలనే ఆలోచన గొప్పది.




వేసవి కాలంలో దాహంతో ఉన్న వారికి మంచినీరు అందించడం అన్నిటికంటే మిన్న. సాయి కుమార్ లాంటి యువకులు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. ఈ చలివేంద్రం ద్వారా వేసవి కాలం ముగిసే వరకు నిరంతరం శుభ్రమైన మంచినీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ రెడ్డి, రాజు గౌడ్, సాయి రెడ్డి, సందీప్,చింటు,బంటీ, జంగయ్య, ఇర్ఫాన్,నవీన్,మహేందర్, సందీప్ రెడ్డి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# ఆయన చేసిన కృషి చిరస్మరణీయం

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ వ్యవస్థాపకులు స్వర్గీయ కి.శే. యాలమూరి పెంచల రెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ, యాలమూరి పెంచల రెడ్డి సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన మహనీయులని కొనియాడారు. భగత్ సింగ్ నగర్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మా రెడ్డి, మాజీ కార్పొరేటర్ కే.ఎం గౌరీష్, కృష్ణ గౌడ్, రషీద్, మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆర్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం

**జయభేరి, దేవరకొండ :**



మునగల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో ఆర్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ లయన్ లేడీ పున్న వెంకటేశ్వర్లు దేవరకొండ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ ఇక్కడి నుండి వెళ్ళిన విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. అలాగే ముఖ్య అతిథిగా విచ్చేసిన పున్న శైలజ దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ మా కళాశాల పూర్వ విద్యార్థి కావడం మాకు ఎంతో గర్వకారణం అని చైర్ పర్సన్ పదవి స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మా కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు వారి భవిష్యత్తుకు సంబంధించి మంచి ఉపన్యాసాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సీవోఈ జి. లింగారెడ్డి డాక్టర్ కె. పృథు, డాక్టర్ కె.రేణుక, డాక్టర్ వి.మకట్లాల్, డాక్టర్ ఎం ప్రభాకర్, పి.మధు, ఎస్. వెంకటరెడ్డి తదితర అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆసరా పెన్షన్లు పెంచాలి

**జయభేరి, చెన్నూర్, మార్చి 18 :**



బడ్జెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వికలాంగుల, వృద్ధుల, వితంతుల, ఒంటరి మహిళల, ఆసరా పెన్షన్లు పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం. వికలాంగులకు రూ. 6000, వృద్ధులు వితంతులు, ఒంటరి మహిళలు, మిగతా ఆసరా పెన్షన్లు రూ. 4000 పెంచి బడ్జెట్ లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి. వికలాంగులకు బస్సుల లో పూర్తి రాయితీ కల్పించాలి. విద్య ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. నిరుద్యోగ వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక ఉపాధిని చూపించాలి. ప్రైవేటు రంగాలలో వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలి. వికలాంగులకు బ్యాంకు రుణ సౌకర్యాలు కల్పించాలి. కుటీర పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలి. స్థానిక సంస్థలలో 5%శాతం రిజర్వేషన్ కల్పించాలి. నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలి. గ్రామపంచాయతీలలో మండల పరిషత్ జిల్లా పరిషత్ మరియు మునిసిపాలిటీలలో కార్పొరేషన్ లో వికలాంగులకు కో ఆప్షన్ మెంబెర్ లు గా అవకాశం కల్పించాలి. అర్హత కలిగిన ప్రతి వికలాంగునికి పెన్షన్స్ సౌకర్యం కల్పించాలి. 2016 దివ్యాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఇందిరమ్మ ఇళ్లలో 5% రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చూడాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు. పోలీస్ స్టేషన్ లలో వికలాంగుల సౌకర్యార్థం ర్యాంప్. కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలలో ర్యాంపులు లిఫ్ట్ సౌకర్యం కచ్చితంగా ఉండాలి అని పెద్దపెల్లి సత్యనారాయణ వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అన్నారు.



## ప్రజలందరికీ శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

- డా. కొర్ర కిషన్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల జీవితాల్లో ఈ కొత్త ఏడాది సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలాగే, ప్రజలందరి జీవితాలు సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తూ, విజయపథంలో సాగాలని కోరారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యుడికి బలం చేకూర్చేందుకు కృషి చేస్తున్న కార్యకర్తలందరూ ఈ ఏడాది మరింత ఉత్సాహంతో, పారదర్శకమైన సమాజం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని, రైతాంగం పాడిపంటలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రజలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఉగాది శుభాకాంక్షలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన పరాభవ నామ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.నూతన తెలుగు సంవత్సరం ప్రజల కుటుంబాల్లో ఆర్థిక,ఆరోగ్య,సంతోషాలను నింపాలని ఆ దేవుడ్ని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.



## ఘనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ జన్మదిన వేడుకలు

- మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు సీనియర్ నాయకులు

**జయభేరి, షాద్ నగర్, మార్చి 18 :**

షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మోహన్ మంచి రాజకీయ నాయకుడిగా ఎదగాలని మోహన్ పై ఎల్లప్పుడూ తన ఆశీస్సులు ఉంటాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ అందే మోహన్,కు మున్సిపల్ చైర్మన్ అంగనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా

- తోఫా అందించిన బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్ మార్చి 18 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని స్థానిక విష్ణువర్ధన్ రెడ్డి కార్యాలయంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరీమణులకు బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి రంజాన్ తోఫా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

- బియ్యం అందజేస్తున్న సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 18 :**

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కొడపాక (ఎర్ర) వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుటుంబానికి గ్రామా సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్ 50kgs బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఎలాంటి అవసరం ఉన్న గ్రామ పంచాయతీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొడపాక రవి, నర్సింహులు, దేవేందర్, శంకరయ్య, నర్సింహులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లించని ఇంటికి తాళం




**జయభేరి, చెన్నూర్, మార్చి 18 :**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను వసూళ్లు ప్రక్రియను మున్సిపల్ సిబ్బంది వేగవంతం చేశారు రెండేళ్లుగా ఇంటి పన్ను చెల్లించని ఇంటికి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో తాళం వేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. గృహ యజమానులు ఇంటి బకాయిలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని లేకపోతే మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పంచాంగ శ్రవణంలో పాల్గొననున్న ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు

**జయభేరి, దేవరకద్ర :**

ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం 5 గంటలకు జరుగు పంచాంగ శ్రవణ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతి సమేత పాల్గొననున్నారు. కావున ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# హారర్ హీరోయిన్: గ్లామరస్ దెయ్యం..



ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ బాంధవి శ్రీధర్. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ అమ్మడు తన అందాలతో కుర్రాళ్లను పిచ్చెక్కిస్తోంది. ఇప్పుడిప్పుడే వరుస ఫోటోషూట్లతో కట్టిపడేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. తెలుగులో మసూధ సినిమాతో ఈ అమ్మడు విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. 2022లో విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో అటు బాంధవి పేరు సైతం ఇండస్ట్రీలో మారుమోగింది. తెలుగులో వచ్చిన బెస్ట్ హార్రర్ చిత్రాల్లో ఇదొకటి. మసూద సినిమాలో సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ కీలకపాత్రల్లో నటించగా.. దెయ్యం పట్టిన అమ్మాయి పాత్రలో బాంధవి శ్రీధర్ తనదైన నటనతో ఆకట్టుకుంది. అయితే మసూధ తర్వాత బాంధవికి గుర్తింపు వచ్చింది కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రాలేదు. ఇటీవలే రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది చిత్రంలో జాన్వీ కపూర్ డూప్ గా నటించిందట. జాన్వీ కపూర్ హైట్ 5 అడుగుల 4 అంగుళాలు. బాంధవి కూడా సేమ్ హైట్ ఉండటంతో ఈ బ్యూటీని డూప్ గా తీసుకున్నారని సమాచారం. బాంధవి శ్రీధర్ కు సోషల్ మీడియాలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె నిత్యం ఫోటోస్, వీడియోస్, రీల్స్ షేర్ చేస్తూ నెటిజన్లతో ఇంట్రాక్ట్ అవుతుంటుంది. అలాగే ఇటీవలే పెద్ది సినిమాలోని చికిరి చికిరి పాటకు హుషారుగా స్టెప్పులేసింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతుంది. మరోవైపు గ్లామరస్ ఫోటోలతో కట్టిపడేస్తుంది ఈ వయ్యారి.



# ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ట్విట్టర్ రివ్యూ..

**పవన్ సినిమా టాక్ ఎలా ఉందంటే?**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన లేటెస్ట్ సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. హరీశ్ శంకర్ తెరకెక్కించిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. అలాగే కోలీవుడ్ స్టార్ నటుడు, దర్శకుడు పార్తీబన్ విలన్ గా మెప్పించారు. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చారు. అలాగే తమన్ బీజీఎం స్కోర్ అందించారు. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఈ మూవీ ఎట్టకేలకు గురువారం (మార్చి 19) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఉగాది కానుకగా ఉస్తాద్ భగత్ సింగ్ థియేటర్లలో విడుదలైంది. ఏపీలో ఉదయం 4 గంటల నుంచే బెనిఫిట్ షోస్ పడగా, తెలంగాణలో 7 గంటల ఆటతో షోస్ మొదలు కానున్నాయి. మరి ఇవాళ థియేటర్లలోకి వచ్చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ఎలా ఉంది? పవన్ కల్యాణ్ సినిమా ఎలాంటి టాక్ ను అందుకుంది. మూవీ చూసిన పబ్లిక్ రియాక్షన్ ఏంటో ట్విట్టర్ రివ్యూలో తెలుసుకుందాం రండి. ఈ క్రమంలో ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ చూసిన ఒక నెటిజన్ తన అభిప్రాయాన్ని ఇలా షేర్ చేసుకున్నాడు.. ‘పవన్ సినిమా సూపర్ అంతే. అమ్మతోడు చచ్చిపోతారు. ఏంట్రా సినిమా అస్సలు ఊహించలేదు. హరీష్ శంకర్ పవన్ కల్యాణ్ ను ఇలా చూపిస్తాడని అస్సలు అనుకోలేదు. థమన్ మ్యూజిక్ అదిరిపోయింది’ అంటూ ట్వీట్ చేశారు. మరో నెటిజన్ ‘ఉస్తాద్ భగత్ సింగ్ బ్లాక్ బస్టర్ మూవీ, పవర్ స్టార్ టాప్ క్లాస్ మోడ్ లో ఉన్నాడు. సినిమా మొత్తం ఓ రేంజులో ఉంది. ప్రీఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ పీక్స్ లో ఉంది. థమన్ మ్యూజిక్ అదిరిపోయింది.. మాస్ డైలాగులు కెవ్వు కేక’ అని రాసుకొచ్చాడు.

# ఓటీటీ టాప్ ట్రెండింగ్ మూవీపై నాగార్జున ప్రశంసలు



గతేడాది కుబేర, కూలీ సినిమాలతో ఆడియెన్స్ ను పలకరించారు అక్కినేని నాగార్జున. అయితే ఈ రెండూ మల్టీ స్టారర్ సినిమాలే. పైగా వీటిలో నాగార్జున నెగెటివ్ రోల్స్ పోషించడం గమనార్హం. దీంతో నాగ్ ను మళ్లీ సోలో హీరోగా చూడాలని అక్కినేని ఫ్యాన్స్ బాగా కోరుకుంటున్నారు. దీనికి తోడు ఇప్పుడు నాగ్ నటించేది వందో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందుకు తగ్గట్టుగానే ఈ మూవీ కోసం కింగ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. తమిళ దర్శకుడు కార్తీక్ తెరకెక్కిస్తోన్న నాగ్ వందో సినిమాలో టబు హీరోయిన్ గా నటిస్తోందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ లో మన్మథుడు బిజీగా ఉంటున్నాడు. అయితే తాజాగా ఈ అక్కినేని హీరో ఓ చిన్న సినిమాపై ప్రశంసలు కురిపించాడు. ఓటీటీలోకి వచ్చిన లేటెస్ట్ సినిమాను చూసి సోషల్ మీడియా వేదికగా చిత్ర బృందానికి అభినందనలు తెలిపాడు. పవన్ కల్యాణ్ ‘ఓజీ’ హీరోయిన్ ప్రియాంక మోహన్ నటించిన లేటెస్ట్ సినిమా మేడిన్ కొరియా. నాగార్జున వందో సినిమాను తెరకెక్కిస్తోన్న ఆర్. కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. మార్చి 12న నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కు వచ్చిన మేడిన్ కొరియా ప్రస్తుతం డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్స్ లో నంబర్‌వన్‌గా ట్రెండ్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే హీరో నాగార్జున ఈ సినిమాను చూశారు. అనంతరం సోషల్ మీడియా వేదికగా చిత్రంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ‘మేడిన్ కొరియా డైరెక్టర్ ఆర్. కార్తీక్ కు ప్రత్యేక అభినందనలు. నెట్ ఫ్లిక్స్ లో వచ్చిన ఈ మూవీ చాలా ఇన్ స్పైరింగ్ గా ఉంది. నేను బాగా ఆస్వాదించాను. ఒత్తిడిలో ఉన్న సమయంలో ఇలాంటి సినిమా మంచి మెడిసిన్‌గా పనిచేస్తుంది. అలాగే ఈ సినిమాలో అద్భుతంగా నటించిన ప్రియాంక మోహన్ కు ప్రత్యేక అభినందనలు’ అంటూ నాగ్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది.

# ఉగాది రోజున గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం..




తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో, తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ (TGFA) రెండో ఎడిషన్ సందర్భంగా హైదరాబాద్ నగరం కళాత్మక మహోత్సవానికి వేదికగా మారనుంది. మార్చి 19, 2026న HITEX కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఈ వేడుకలో భారతీయ సినీ రంగంలోని దిగ్గజాలు, రాష్ట్ర నాయకులు కలిసి తెలుగు ప్రతిభను సత్కరించనున్నారు. సినిమా, సంస్కృతి మరియు ప్రజల స్వరానికి అంకితమైన ఈ TGFA అవార్డులు రాష్ట్రంలో అత్యున్నత సినీ గౌరవంగా నిలుస్తాయి. సినిమా, థియేటర్, టెలివిజన్ రంగాల్లో విశిష్ట ప్రతిభను గుర్తించి, ప్రాంతీయ కథనాలను ప్రోత్సహించడం, పరిశ్రమకు వెన్నెముకలైన టెక్నీషియన్లను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

**TGFA 2026 ప్రధాన అవార్డ్స్ హోస్ట్స్:** ‘స్మాల్ స్క్రీన్ క్వీన్’ సుమ కనకాల, ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నడిపిస్తారు.

**హాజరుకానున్న ప్రముఖులు:** మెగాస్టార్ చిరంజీవి, ఉలగనాయగన్ కమల్ హాసన్, కింగ్ నాగార్జున, అక్కినేని అఖిల్, నాగ చైతన్య, రష్మిక మందన్న, ఖుష్బూ సుందర్, సజా అలీ, మాధురి దీక్షిత్ నేనే, శోభిత ధూళిపాళ, రితేష్ దేశ్ముఖ్ - జెనీలియా దేశ్ముఖ్ వంటి ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొననున్నారు. జాతీయ, ప్రాంతీయ సినీ రంగ ప్రముఖులు, ప్రభుత్వ ప్రముఖులు, భాగస్వాములు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

# ఒక అమ్మాయిని మరో అమ్మాయే మోసం చేస్తుంది..



బిగ్‌బాస్ తెలుగు రియాలిటీ షోతో షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో రీతూ చౌదరి ఒకరు. అంతుకు ముందు పలు సీరియల్స్, టీవీ షోస్ లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ గతేడాది బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో మెరిసింది. తన ఆట, మాట తీరుతో అందరి దృష్టిని ఆకర్షించింది. అన్నిటికీ మించి డీమాన్ పవన్ తో లవ్ ట్రాక్ నడిపి బాగా హైలెట్ అయ్యింది. ప్రస్తుతం టీవీ షోస్, ప్రోగ్రామ్స్ తో బిజీగా ఉంటోన్న రీతూ చౌదరి సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ‘ఒక అమ్మాయి హార్ట్ బ్రేకప్ చేసి ఆ అబ్బాయి ముందుకు వెళ్లిపోతాడు. అతను చాలా ఈజీగా మరో అమ్మాయితో వెళ్లిపోతాడు. కానీ అమ్మాయి మాత్రం అలా కాదు. అన్ని తెలిసినా కూడా సైలెంట్‌గానే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఫ్రెండ్ షిప్ కూడా బలమైన ఆయుధంగా మారింది. ఒక అమ్మాయి డబ్బు కోసం, చీప్ అటెన్షన్ కోసం మరో అమ్మాయిపై ఆరోపణలు చేస్తుంది. సమాజం ముందు బ్యాడ్ చేస్తుంది. ఒక అమ్మాయి మరో అమ్మాయిని నాశనం చేస్తుందని తెలిసినా కూడా ఆ అమ్మాయి సైలెంట్‌గానే ఉంటుంది. అది ఆమె బలహీనత కాదు.. అదంతా తన కర్మ అని నమ్ముతుంది. తన గురించి నిజాలు తెలియని ఈ సమాజం జడ్జ్ చేస్తున్నా కూడా సైలెంట్ గా ఆ బాధని భరిస్తుంది’ అంటూ తన ఆవేదనకు అక్షర రూపమిచ్చింది. ప్రస్తుతం రీతూ చౌదరి షేర్ చేసిన ఈ లాంగ్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిపై నెటిజన్లు భిన్న రకాలుగా చర్చించుకుంటున్నారు. అసలు రీతూకు ఏమయ్యింది? ఈ స్టోరీ తనదేనా లేదంటే తన ఫ్రెండ్ గురించేనా? అంటూ ఆరా తీస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**